క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉన్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ ప్రకటించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పల్లెచెరువు, రీగల్ గార్డెన్, బృందావన్ కాలనీ, బీ.కే.పురం పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కోత ఉంటుందన్నారు.

గగన్‌పహాడ్‌లో...

◆ గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 2.30 వరకు గోల్డ్ డ్రాప్ కంపెనీ, లోహియా, గగన్‌పహాడ్, మెట్రోహిల్స్, వెంకటేశ్వర కాలనీ, బసిరెడ్డి వీధి తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు.

శివరాంపల్లిలో...

నేషనల్ పోలీస్ అకాడమీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

22 నుంచి జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ

రాజేంద్రనగర్: నట్టల నివారణ మందులు వేయడం వల్ల జీవాలు ఆరోగ్యం, బలంగా, చురుకుగా ఉంటాయని రాజేంద్రనగర్ పశువైద్యాధికారి డాక్టర్ ఎం.కె.శ్రీకాంత్ తెలిపారు. రాజేంద్రనగర్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీవాల ఆరోగ్యం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది జీవాల పెంపకందారుల ఇళ్లు, కొట్టం వద్దకే వచ్చి ఉచితంగా నట్టల నివారణ మందులను జీవాలకు వేస్తారన్నారు.

◆ హైదర్‌గూడలో 22వ తేదీన, భగవతిగూడలో 23న, ప్రేమావతిపేటలో 24న, శివరాంపల్లిలో 25న, రాజేంద్రనగర్‌లో 27న, గగన్‌పహాడ్‌లో 28న, మిగిలిన ప్రాంతాల్లో జీవాలలో షెడ్యూల్ ప్రకారం నట్టల నివారణ మందులు వేయనున్నట్లు ప్రకటించారు.

ప్రత్యేక పూజలు



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ విజయ గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళవారం చండీయాగం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

గోల్కొండ: కేన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారణ సాధ్యమని రోటరీ క్లబ్ ప్రతినిధి ఏకాంబర రెడ్డి అన్నారు. మంగళవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీకి చెందిన వైద్యులు స్క్రీనింగ్ క్యాంప్‌లో పాల్గొని కళాశాల సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు.

పనిచేయని సిగ్నల్స్‌తో వాహనదారుల ఇబ్బందులు

గోల్కొండ: రోడ్ల కూడళ్ల వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు అలంకారప్రాయంగా మారాయి. మెహిదీపట్నం మేరాజ్ చౌరస్తా, టూంబ్స్ చౌరస్తా వంటి రద్దీ ప్రదేశాల్లో సిగ్నల్ లైట్లు పని చేయడం లేదు. అత్యంత రద్దీగా ఉండే మేరాజ్ చౌరస్తాలో సిగ్నల్స్ సరిగా పనిచేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సిగ్నల్స్‌కు మరమ్మతులు చేయాలని, కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని వాహనదారులు కోరుతున్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో బీఆర్ఎస్ నాయకులు

గోల్కొండ: మైనార్టీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇప్పటికే వారి కోసం వేలాది కోట్ల రూపాయలు కేటాయించిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ మంత్రిని కలిశారు. మైనార్టీలకు సబ్సిడీ లోన్ స్కీం కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మహ్మద్ నయీముద్దీన్, మౌలానా, మహ్మద్ నసీముద్దీన్, సయ్యద్ నసీబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

వివాదాస్పద భూముల్లో గ్రామస్తుల ఆందోళన



సుల్తాన్‌పల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ ఏ.శ్రీధర్‌కుమార్



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

శంషాబాద్ రూరల్: వివాదాస్పద భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మంగళవారం మండలంలోని సుల్తాన్‌పల్లి రెవెన్యూలోని సర్వే నంబర్లు 129, 142లో ఉన్న 25 ఎకరాలను గతంలో ప్రభుత్వ భూములుగా పేర్కొన్నారు. ఈ భూములపై ఇటీవల పట్టా పాసు పుస్తకాలు జారీ అయ్యాయి. సర్వే నంబరు 142లో 2007లో 84 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రెండు రోజుల నుంచి ఈ భూముల్లో పట్టాదారులు చదును పనులు చేపట్టగా.. స్థానికులు సదరు స్థలంలో ఆందోళనకు దిగారు.

◆ ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు ఇళ్ల పట్టాలు ఉన్న పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ ఏ.శ్రీధర్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు.

◆ పట్టా భూములుగా పాసు పుస్తకాలు జారీ అయ్యాయని గ్రామస్తులు ఆందోళన విరమించాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే న్యాయపరంగా ఎదుర్కోవాలని సూచించారు.

పనులు నిలిపివేత..

◆ సర్వే నంబర్ 129లో 14 ఎకరాల భూమి ఉండగా.. ఈ విస్తీర్ణంలో బోడోటని కుంట ఉంది. పట్టాదారులు భూమిని చదును చేయడంతో సమాచారం అందుకున్న సాగునీటిశాఖ ఏఈ మౌనిక కుంటను పరిశీలించారు. ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టవద్దని బాధ్యులకు నోటీసులు జారీ చేస్తామని ఏఈ హెచ్చరించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి : కాంగ్రెస్

సుల్తాన్‌పల్లిలో ఆందోళనకు దిగిన స్థానికులకు కాంగ్రెస్ నాయకులు మద్దతు పలికారు. 25 ఎకరాల ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. గ్రామస్తులకు న్యాయం జరిగేంత వరకు వారి వెంటే ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి ఈ భూములపై ఫిర్యాదు చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్, నాయకులు జహంగీర్‌పాషా, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సామాజిక హక్కుల దినోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రపంచ సామాజిక హక్కుల దినోత్సవం సందర్భంగా 'హ్యూమన్ రైట్స్ క్లబ్, పీపుల్స్ యాక్షన్ ఫర్ రూరల్ అవేకెనింగ్' సంస్థలు సంయుక్తంగా ప్రపంచ సామాజిక హక్కుల దినోత్సవాన్ని గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా దేశంలో మతం మాత్రమే రాజ్యం చేస్తోందని మనిషిని మనిషిగా గుర్తించడం లేదన్నారు. మనుషులు, వారి హక్కులు, ప్రజాస్వామ్యం, సమత లాంటి ఆధునిక ఉదార విలువలను గౌరవించాలని అమానవీయ ధోరణిని నిలువరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ధోరణిని ఎదురించని పక్షంలో దేశం మధ్య యుగాల వైపునకు వెళ్లడం ఖాయమని అభిప్రాయపడ్డారు. డైరెక్టర్ అంబేడ్కర్, నగేష్, ఫాదర్ శరత్, శ్రీలత, తిరుపతి, సుమతి, మహేష్, కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు నవారు మాణిక్యం రెడ్డి, సరిత, సూర్యకుమారి, గోపాలకృష్ణ, జాన్సన్, క్లబ్ సభ్యులు తదితరులున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన

మణికొండ: అనాదిగా ఉన్న శ్మశానవాటికను ఎట్టకేలకు మున్సిపాలిటీ తరఫున అభివృద్ధి చేయటం శుభపరిణామని బీఆర్ఎస్ పార్టీ నార్సింగి మున్సిపల్ నాయకులు ఫారూఖ్, జితేందర్‌లు అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని దళిత శ్మశానవాటిక అభివృద్ధి పనులను మంగళవారం మున్సిపాలిటీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పనులను పరిశీలించి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్మశాన వాటికలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి చేయటంతో ప్రజలు సంతోషిస్తున్నారన్నారు.

బెర్కాడియా సర్వీసెస్‌తో సీబీఐటీ ఒప్పందం

మణికొండ: విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్లు, పరిశ్రమలకు కావాల్సిన శిక్షణను విద్యార్థులకు అందించేందుకు బెర్కాడియా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో సీబీఐటీ కళాశాల ఒప్పందం చేసుకుంది. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి, సంస్థ హ్యూమన్ రిసోర్సెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేబాశిష్ ఘోష్‌లు సంతకాలు చేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులను మరింత ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ అనంతరం ఉత్తమ సంస్థలలో ఉద్యోగాలను సాధించేందుకు విద్యార్థులకు వీలు కలుగుతుందన్నారు. ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ డైరెక్టర్ యూకే చౌదరి, బెర్కాడియా సంస్థ మేనేజర్ జయకర్, ఫ్యాకల్టీ ప్లేస్‌మెంట్ కో- ఆర్డినేటర్ డాక్టర్ దమన్‌జీత్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు.. వ్యక్తికి స్వల్ప గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మణికొండ: అతి వేగంగా వచ్చిన కారు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ చింతచెట్టు సర్కిల్ నుంచి అలిజాపూర్ దారిలో రోడ్డును విస్తరించడంతో ఈ మధ్య కార్లను అతివేగంగా నడుపుతున్నారు. ముందు వెళ్తున్న వాహనాలను సైతం గమనించకుండా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం ఓ కారు వేగంగా వచ్చి ఒక్కసారిగా బ్రేక్ వేయటంతో డివైడర్‌కు ఢీకొని ఆగిపోయింది. మంగళవారం మరో కారు వేగంగా వచ్చి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుపై జనం లేకపోవటంతో ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని అజాగ్రత్తగా వాహనాలు నడిపే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



బండ్లగూడ: ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి కిస్మత్‌పూర్ మీదుగా చేవెళ్ల రోడ్డు వరకు రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందని ట్రయంఫ్ విల్లా కమ్యూనిటీ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవడంతో పాటు వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. మార్చి నెల చివరినాటికి రోడ్డు పనులను ప్రారంభిస్తామని ప్రాజెక్టును తానే స్వయంగా పర్యవేక్షిస్తానన్నారు.

అలకాపూర్ సమస్యలపై..

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో మరిన్ని రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల ఏర్పాటు లాంటి సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను నివాసితులు కోరారు. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు అవసరమయ్యే పనులను చేపడుతున్నామని అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు నవీన్‌కుమార్, వసంతరావు, టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు.



'పాతబస్తీ మెట్రోపై ప్రభుత్వం వివక్ష' : కేవీఎల్ఎన్ రెడ్డి

గౌలిపురా: పాతబస్తీకి మెట్రో రైలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఇన్‌చార్జి కె.వి.ఎల్.ఎన్.రెడ్డి విమర్శించారు. గౌలిపురా డివిజన్‌లోని పటేల్‌నగర్ హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వద్ద మంగళవారం శక్తి కేంద్ర ఇన్‌చార్జి ఇ.సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతంలో అభివృద్ధి జరగకుండా ఎంఐఎం అడ్డుకుంటుందన్నారు. గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు నిధులు ఇవ్వకుండా అభివృద్ధికి అడ్డుపడుతుందన్నారు. బస్తీల్లో మురుగు నీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జలమండలి అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా నిధులు మంజూరు చేయడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జమాల్‌పూర్ చంద్రశేఖర్, గౌలీకర్ ధీరజ్‌లాల్, జి.రఘుకాంత్, డి.ప్రవీణ్‌కుమార్, పి.రమేశ్‌గురుస్వామి, జమాల్‌పూర్ అశోక్, ఎ.భానుప్రకాశ్, కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న భౌ.. భౌలు !

● పట్టణంలోని పలు కాలనీల్లో వీధి కుక్కలు, పందుల స్వైరవిహారం

● గతంలో చిన్నారిని గాయపరిచిన పందులు

శంషాబాద్: మున్సిపాలిటీలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పట్టణంలోని అనేక కాలనీల్లో శునకాలతో జనాలు బెంబేలెత్తుతున్నారు. నగరంలో ఇటీవల వీధి కుక్కల భారిన పడి మృతి చెందిన బాలుడి ఘటనతోనైనా మున్సిపాలిటీ అధికారులు మేల్కొనాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పట్టింపే లేదు..

◆ మున్సిపాలిటీలో ఆరోగ్యశాఖ విభాగం పనితీరు అయోమయంగా మారుతోంది. వీధి కుక్కల బెడద నుంచి రక్షించాలని పలుసార్లు ఆయా కాలనీల ప్రజలు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. కుక్కల భారినపడి గాయాల పాలైన ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి.

◆ పట్టణంలోని సిద్ధంతి, ఆదర్శకాలనీ, మధురానగర్, పోచమ్మబస్తీ, బ్రాహ్మణవాడి, అహ్మద్‌నగర్, కోమటిబస్తీ, సంజయ్‌వాడ బస్తీలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు జంకుతున్నారు.

చేయాల్సింది ఇదీ..

◆ వీధి కుక్కలను పట్టుకుని వాటికి వ్యాక్సినేషన్ వేసి అనంతరం పది రోజుల పాటు ప్రత్యేక కేంద్రంలో వాటిని క్వారంటైన్ చేసి ఆరోగ్యంగా ఉన్న తర్వాతనే వదిలేయాలి. ప్రస్తుతం మున్సిపాలిటీలో ఇలాంటి ప్రక్రియ ఒక్కటైనా చేపట్టలేదు. దీంతో పట్టణంలో వీధి కుక్కల పెరుగుదల ప్రక్రియ ఇంతకింతకు పెరిగిపోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

రాజకీయం..

◆ కుక్కలకు తోడు పట్టణంలో పెరుగుతున్న పందుల విషయంలో స్థానిక రాజకీయం అంతా ఇంతా కాదు. ఏళ్లుగా వీటిని తగ్గించే చర్యలను అధికారులు తీసుకున్న వెంటనే రాజకీయ నేతలు పందుల వ్యాపారులకు కొమ్ము కాస్తూ రంగంలోకి దిగుతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో పందుల బెడద కూడా ఇంత వరకు తగ్గడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

◆ ఆరేళ్ల క్రితం ఓ చిన్నారిపై పందులు గుంపులు గుంపులుగా దాడిచేసి గాయపరిచిన ఘటన కూడా పట్టణంలోని మధురానగర్ కాలనీలో చోటు చేసుకుంది.

చర్యలు తీసుకుంటాం..

పట్టణంలో వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నాం. దీనిపై కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేశాం. ఇతర ప్రాంతాల నుంచి కొందరు కుక్కలను తీసుకొచ్చి ఇక్కడే వదిలేస్తున్నారు. కుక్కలు, పందులను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను చేపడతాం.

– వెంకట్‌రెడ్డి, పారిశుద్ధ్య విభాగం అధికారి

ప్రజా సమస్యలపై పోరాడతాం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి హరికృష్ణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్‌లోని తేజస్వీనగర్ కాలనీలో 'ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్' సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి హరికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై బీజేపీ ముందుండి పోరాడుతుందని రాష్ట్రంలో జరిగే అన్యాయాలపై ప్రశ్నిస్తుందన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చూడాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్, మల్లేష్‌యాదవ్, విజయ్‌కుమార్, రాచూరి రాజశేఖర్, రాజు, రాములు, దుర్గాప్రసాద్, చరణ్‌ప్రసాద్, రామ్మూర్తి, మునిందర్ తదితరులున్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చడంలో విఫలం..

మణికొండ: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకపోవటం, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడతామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మణికొండ క్వార్టర్స్, హుడాకాలనీలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు చిలుకూరు బీరప్ప అధ్యక్షతన 'ప్రజాగోస-బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇళ్లులేని పేదలకు డబుల్ బెడ్ రూం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ప్రతీ ఇంటికి తాగునీరు, 24 గంటల విద్యుత్ సరఫరా అందజేస్తామని చెప్పి అమలు చేయలేకపోయారని విమర్శించారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ నాయకులు మహాలింగంగౌడ్, శ్రీనివాస్, సీహెచ్ ఇందిర, కౌన్సిలర్ ఎల్. వందనానగేష్, కో- ఆప్షన్ సభ్యుడు సిద్దప్ప, నర్సింగ్‌రావు, అనితాదేవి, నర్సయ్యాచారి తదితరులున్నారు.

ఘనంగా మచిలేశ్వరస్వామి రథోత్సవం



దేవాలయం నుంచి మంచిరేవుల గ్రామానికి వస్తున్న రథోత్సవం

మణికొండ: మంచిరేవుల మచిలేశ్వరస్వామి, వీరభద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్వామి వారిని రథంపై దేవాలయం నుంచి గ్రామం వరకు ఊరేగింపుగా గ్రామస్తులంతా కలిసి తీసుకొచ్చారు. అనంతరం వారు తమ ఇంటికి ముందుకు వచ్చిన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు మంగళవారం తెల్లవారు జామున రథోత్సవం, మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ దేవాలయ వంశ పారపర్య ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: కంటి సమస్యలు ఉన్న వారు 'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కౌన్సిలర్ హైమాంజలిఅనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం తన వార్డు పరిధిలోని ల్యాంకోహిల్స్‌లో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత దెబ్బతినటంతోనే అనేక మందికి కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. వాటికి సకాలంలో పరీక్షలు నిర్వహించుకుని నయం చేసుకోవాలని సూచించారు. ల్యాంకోహిల్స్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు అర్జున్, సంయుక్త కార్యదర్శి కిషోర్, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ తదితరులున్నారు.



ఆదర్శవంతంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నాం



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను గ్రేటర్‌లోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రగతి కాలనీలో మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకే బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, నూతన డ్రైనేజీ వ్యవస్థ తదితర పనులను త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారించేందుకు తాను సిద్ధంగా ఉంటానన్నారు. మహేందర్‌రెడ్డి, నవారు మురళీధర్‌రెడ్డి, రజనీష్, దీపక్, చెన్నయ్యరెడ్డి, సత్తిరెడ్డి, శశిధర్‌రెడ్డి, భాస్కర్, సుధాకర్, పాండుయాదవ్, శేఖర్, నరేందర్, ఏఈ బల్వంత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, శానిటేషన్ సమేష్ తదితరులున్నారు.

రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు

మైలార్‌దేవ్‌పల్లి: రామకృష్ణ పరమహంస చూపిన దారిలో సమాజం ముందుకెళ్లాలని రామకృష్ణ సేవా సమితి సభ్యులు బొల్ల శ్రీనివాస్ అన్నారు. రామకృష్ణ పరమహంస 188వ జయంతి సందర్భంగా 31 మంది పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామకృష్ణ పరమహంస చూపిన మార్గాన్ని అనుసరిస్తూ ప్రజలు మెలగాలన్నారు. బి.నరేందర్, డీ.వీ.కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు నూతన దుస్తులను అందజేస్తున్న దృశ్యం

ప్రజా దర్బార్‌తో సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: తానెప్పుడూ పేదల పక్షానే నిలుస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకిలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. వేసవిలో ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీటి సరఫరా విషయంపై అధికారులు సైతం సానుకూలంగా స్పందిస్తున్నారని, వేసవిలో నీటి సరఫరాలో ఎలాంటి కోతలు ఉండవని అధికారులు హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు కొంతమేర ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఆయన అన్నారు. పలు ప్రాంతాల్లో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు, వరద నీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని, వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులను పూర్తి చేస్తామని చెప్పారు.

మిల్లెట్స్‌తో ఆరోగ్యం

మణికొండ: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని బిగోనియా హోమ్స్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మిల్లెట్స్ టిఫిన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని ఈ ఏడాదిని మిల్లెట్స్ సంవత్సరంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునివ్వటంతోనే ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది మొత్తం 365 కేంద్రాల్లో రోజూ 365 మందికి పైగా అన్ని రకాల చిరుధాన్యాల టిఫిన్‌లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు చిలుకూరు బీరప్ప, కో- ఆప్షన్ సభ్యుడు లక్ష్మీరాములు, సీ.హెచ్ ఇందిర, శంకర్‌సింగ్, వేణుకుమార్, అనితాదేవి, వెంకటాచారి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మిల్లెట్స్ టిఫిన్‌లను అందిస్తున్న అంజన్‌కుమార్